# సైనాజరు

ఆర్. హిమబిందు

విశాఖపట్నం మా అమ్మాయినిచ్చాం. మా స్కూలుకు వేసవి సెలవులిచ్చేశారు. మా కాంతం ఒకటే పోరుతుంది. "ఈ వేసంకాలం సెలవుల్లోనయినా అమ్మాయి నొకసారి చూచిరండీ" అని. "మీ మాస్టారు గిరీ ఎప్పుడూ వుండేదేగా, పెద్దదానికి రెండో పురుడు పోసిం తర్వాత బిడ్డ ఎల్లా వుందో చూద్దామన్న ధ్యాసే లేకపాయె- ఈసారి మీరు తప్పక వెళ్ళితీరాలె." నాకూ మనసులో వెళదామనే వుంది. అసలు కాంతాన్ని కూడా తీసుకువెళదామనే నా ఊహ- దానికి ఆపెద ఇచ్చిన సమాధానం చూడండి-

"ఆఁ ఆఁ వెళితే బాగుగానె వుంటుంది కానీ ఇక్కడ బుజ్జిగాడు, చంటి, పనమ్మాయి ఇల్లూ ఏమైపోవాలీ అంట? నేను మరోసారి వెళ్ళొస్తాను. ఈ సారికి మీరు బయలుదేరండి" అంటూ నన్ను బయలుదేర దీసింది. ఇల్లంటే మా కాంతానికి అంత ప్రేమ-




"ఏమోయ్ కాంతం! నా దంతధావనానికి రెండు శ్రేష్ఠమైన గానుగ పుల్లలు సంచిలో వేస్తివా?" "గానుగ పుల్లలేం ఖర్మట. పళ్ళపొడి ఇంటిలో దంచింది శుభ్రంగా పెడితేనూ."

సరే బాగుంది. ఒహ మరచెంబు, సంచీ అందులో ఒక మూడ్రోజులికి సరిపడా బట్టలూ, గొడుగు తీసుకుని రైలు స్టేషనుకు జటకాబండీ కోసం మా వాడిని పంపాను.

"ఏవండీ! వెళ్ళగానే ఓ ఉత్తరమ్ముక్క పడేస్తారా?"

"విశేషంలా వ్రాస్తాను." ఇంతలో మా వాడు జుయ్యిమని బాణంలా వచ్చేశాడు జట్కావాడితో.

మా ఆవిడ దగ్గర వీడ్కోలు తీసుకుని జట్కాబండీ ఎక్కి కూర్చున్నాను.

మా కాంతం వెనకనుండి కేకలేస్తూనే వుంది.

"బండీలో నిద్దరోతారేమో కుదుపులకి నడుములు పట్టేస్తాయి మీకు."

"నిద్దరోను లేవే! వెళ్ళొస్తాను."

"అలాగే క్షేమంగా వెళ్ళిరండి"

బండీ సులువుగానే ధూమశకటముల నిలుపు చోటుకు వచ్చి ఆగింది.

"ఇదిగో అబ్బీ ఎంతిమ్మన్నావు?"

"అరణాలండీ బాబయ్యా"

"ఓరి నీ అసాధ్యం గూల. ధరలెట్లా పెంచేస్తున్నార్రా మీరు. ఇంద ఈ పావలా కాసు తీసుకో."

"అదేంటండీ బాబయ్యా. కష్టం జేసి నోణ్ణి. ఇంకో అణా ఇప్పించండి."

"ఊహుఁ ఎంత మాత్రం కుదర్దు. నేను గాబట్టి దయతలచి పావలాయేనా ఇచ్చానుగానీ మా కాంతమైతే మూడణాల్తో సరిపుచ్చేదిగామీ....."

"బాగా బుద్ధొచ్చింది బాబూ. ఇంక మీ పేటకు నా జట్కా ఛస్తే తోలుకురాను."

"ఏడిశావ్ లే పో. నువ్వుగాకుంటే మరొహడు."

విశాఖకొక టిక్కెట్టు పుచ్చుకుని అలా ప్లాటుఫారం మీద నడుస్తున్నాను. ఇంతలో వెనక నుండి "నమస్కారం మాస్టారూ! నన్ను గుర్తు పట్టారా" అంటూ ఓ కుర్రవాడు పలుకరించగా ఆగి, పరిశీలనగా చూసి,

"ఓహ్ నువ్వటోయ్ ... నీ పేరూ.... అదే.... జ్ఞాపకం రావటం లేదోయ్!"

"నా పేరు రాంభొట్లండీ. వీడు మా తమ్ముడండీ" అంటూ పక్క కుర్రవాడిని చూపించాడు.

"పదోతరగతిలో చరిత్ర పాఠం చెప్పేవారు గదండి- వీడున్నాడే వీడూ- మీ స్కూల్లోనే తొమ్మిదో క్లాసు చదూతున్నడండి. వీడ్ని మీరు కాస్తంత కనిపెట్టి వుండాలె."

"ఇప్పుడు గుర్తొచ్చిందయ్యా! అయితే రాంభొట్లూ నువ్విప్పుడేం చేస్తున్నట్లు?"

"మా నాన్నగారిక్క వ్యాపారంలో సాయపడుతున్నానండి."

"మంచిది! ఇంతకూ ఎక్కడదాకా?"

"విశాఖపట్నం దాకానండి. అక్కడ మాకు కావలసిన సరుకులు కొని, ఇక్కడకు తీసుకొచ్చి అమ్ముతామండి."

"మీరు ఎక్కడి వరకూ వస్తున్నారో సెలవీలేదు."

"నేనూ విశాఖేనయ్యా— మా అమ్మాయిని అక్కడిచ్చాం— చూద్దామని వెళ్తున్నా."

"అలాగా- అయితే మీ తోడు నాకు విశాఖపట్నం దాకా వుంటుందన్న మాట. చాలా సంతోషం మాష్టారూ" అని చెప్తూనే "ఒరేయ్ అబ్బాయ్! నేను మాష్టారుగారితో మాట్లాడుతూ వుంటాగానీ నువ్వెళ్ళి పత్రికలు రెండు. న్యూసు పేపర్లు, స్కేనాజర్లొక రెండు పట్టా పో- ఇక్కడున్నట్లు రావాలి" అంటూ కుర్రవాడిని పంపించాడు.

అంతా విన్న నాకు మతిపోయింది. 'స్కేనాజర్లంటాదేవిటీ చెప్మా. ఇంతవరకూ ఎక్కడా అటువంటి పేరు తగల్లేదే!' ఈ ప్లాటుఫారం మీద దొరికే వస్తువుల్లో అది ఏదైౖ వుంటుందన్న సంశయం నన్ను బాధిస్తోనే వుంది. అసలా కుర్రాడు ఏమిటి తెస్తాడో చూద్దామని కుతూహలంగా వుంది.

ఇంతలో కుర్రవాడు పత్రికలు రెండూ, న్యూసు పేపర్లో రెండు పట్టుకొచ్చి చిల్లర అతని కిస్తూ "మరే! స్కేనేజార్లు లేవంటన్నయ్యా"

"స్కేనేజార్లు కాదురా పిచ్చికుంకా! స్కేనాజర్లు"

"అరె.... స్కేనాజర్లుఇక్కడ దొరక్కపోవటమేమిటి. చూశారా మాస్టారు. మా చిన్న తనంలో ఎంత పెద్దవి వుండేవి.... ఎంత అందంగా వుండేవి...."

అతను చెపుతున్న విషయం గురించి నాకు బొత్తిగా తెలియదు. అయినా నాకు తెలియదని అతడు తెలుసుకో కూడదని,

"అవునవును. మా కాలంలో అయితే ఎరుపు. ఆకుపచ్చ. తెలుపు రంగులలో కూడా వచ్చేవి."

"చాలా బాగా చెప్పారు. అయినా ఇప్పటి వాళ్ళకు వాటి విలువేం తెలుస్తుందండి. అసలు ఒక్కొక్క స్కేనాజరు ఎంత నాజూగ్గా తయారు చేసే వాళ్ళండి. మరీ బొత్తినాసిరకంవస్తున్నాయిఇప్పుడు" దానికి నేను మరో మాట-"అబ్బ! పాలరాతిలా నిగనిగమెరుస్తుండేవి కాదుటోయ్ రాంబోట్లు"

అతని ఉపన్యాసం అలా వాటిమీద అనర్గళంగా సాగిపోతూనే వుంది.

ఇంతలో మా బండీ రావటమూ, మే



మందులో ఎక్కడమూ జరిగిపోయినాయి- అతనే ఒక మంచి స్థలం చూపించాడు. వసతి గలది— దూరప్రయాణం గనుక కొంచెం టాయిలెట్టుకి దగ్గరలో వుండే సీట్లు, ఇష్టపడతాను నేను- ఏ క్షణాన్ని ఏం ముంచుకు వస్తుందో చెప్పలేం కదా!

మా బండి కదిలింది. చిన్న కుర్రాడికి టాటా చెప్పి రాంబోట్లు నా పక్కగా వచ్చి కూర్చున్నాడు.

"ఈ స్కేనాజర్లున్నాయి చూడండి మాస్టారు, ఇక్కడ కంటే విశాఖపట్నంలో మంచివి. నాణ్యమైనవి దొరుకుతాయండి. పైగా చవక. అక్కడి ప్లాటుఫారం మీద ప్రయత్నిద్దాం."

"అవును కదూ. విశాఖపట్నం ప్లాటుఫారం మీద ఎక్కడ చూసినా అవే. ఇక్కడో స్కేనాజర్ కనపడితే, అదుగో ఆ పక్క షాపులో మరొహటి."

నాకు ఎంత ఆలోచించినా ఆ వస్తువేదో అంతుపట్టడం లేదు.

ఏదో గౌరవంనిలబెట్టుకోవడం కోసం కోతలు కోస్తున్నా గానీ. విశాఖపట్నంలో కొంటాదంటగా అప్పుడు చూద్దామన్న కుతూహలం నాలో హెచ్చింది.

కుర్రవాడు మళ్ళీ ప్రసంగాన్ని రాజకీయాలవయిపు మళ్ళించాడు. నేను కిటికీలోంచి వెనక్కి పరిగెడుతూ వున్న దృశ్యాల్ని, చెట్లనీ టెలిగ్రాపు లైన్లనీ చూస్తూ ఊ కొడుతూ ఆలోచిస్తున్నాను.

'ఎరుపు, ఆకుపచ్చ, తెలుపు రంగులలో వుంటుందా-

ప్లాటు ఫా రం మీదనే దొరుకుతుందా-

విశాఖపట్నంలో అయితే చవకనా- ఏమిటా అది—' అంటూ మనసు ఆలోచిస్తోంది.

'పెద్దతనం కాదూ గుర్తులేదేమో.... అయినా ఎటూ తినబోతూ రుచిదేనికి?' అంటూ సర్దిచెప్పుకొన్నాను.

చివరకు ఎట్లాగైతేనేమి మెయిలుబండి పది గంటలు ప్రయాణం మా చేత చేయించి విశాఖపట్నంలో దించింది. మేమిద్దరం టి. సి.కి గేటు దగ్గిర టిక్కెటు ఇచ్చేసి బయటకొచ్చాం. అతనే అడిగాడు నన్ను.

"మాస్టారూ నిజంగా మీ కసలు స్కేనాజరు అంటే ఏమిటో తెలుసునా?" నా గుండె రాయి పడింది.

"అది ఏదో గుర్తుకు రావడం లేదోయ్. పెద్దవయసు కదా. నువ్వు కొంటానన్నావు గదా చూద్దామనీ" మాట అలా తప్పించాను.

"మీరు నన్ను క్షమించాలి. మీరు హాస్య చతురులని తెలిసి నేనూ మావాడూ ఈ చిన్న తమాషా చేశాం. అసలు స్కేనాజరు అంటే ఏమిటో నాకుకూడా తెలియదండి."

"హరి పిడుగా! అసలు తెలియనిదాన్ని గురించి ఎంతలా వర్ణించావు. మంచి శిష్యుడివే!" అంటూ మనస్ఫూర్తిగా నవ్వేశాను.

నేను నవ్వడం చూసిన అతను కూడా నాతో శృతి కలిపాడు.

[ఈ కథ మునిమాణిక్యం నరసింహారావు దొరకని కథల్లో ఒకటి. ఆయన పుస్తకాల్తో పరిచయం. కథా ఇతివృత్తం ఆయన శైలి తెలిసి వుండటం చేత- అదే విధంగా పొందుపరచడం జరిగింది.]

—రచయిత